# ప్రేమ..పెళ్ళి...

"చారుణికి.........

నమస్తే! నీవు పెట్టిన గడువు దాటిపోయినా ఈ ఉత్తరం వ్రాయటానికి నాకే తీరిక లేక పోయింది. ఈ పాటికి నీకు బోలెడంత కోపం వచ్చివుంటుంది. అవునా? అయినా నాకు తీరిక లేక వ్రాయకపోతే నీవెందుకు వ్రాయకూడదూ"... మాకు యిక్కడ పరీక్షలవడంచేత ప్రశ్నేలెట్లోపడి తీరుబడి చిక్కలేదు. ఏమయినా యిక సోమవారం అంటే రేపు టపాలో ఈ ఉత్తరం వేయాలని యిప్పుడే కార్యాన్ని ప్రారంభించాను. ఈ ఉత్తరమంటే మొదలుపెట్టాను గాని అందులోకి ఆధార మేది?...మళ్ళీమామూలు నమస్తే!...విశేషాలేం కనబడక పోవటం! అయినా వ్రాయాలిగా...ఏవో విశేషాలు అందుకని వ్రాస్తున్నాను.

ఈ మధ్య బందరు వెళ్ళాను. ఆ రోజే నీ దగ్గర్నుంచి కార్డు వచ్చింది. ఆ కార్డును జేబులో పెట్టుకునే వెళ్ళాను. అక్కడ మా చుట్టాలింటికి వెళ్ళాను. ఆ యింట్లో అందరితోను చాల చనువుగా ఉంటాను మా పిన్ని—వరసకు పిన్ని అవుతుంది... నా జేబులో కార్డు గభుక్కున తీసింది. కాదనే లోగానే చదవసాగింది. Hand writing బట్టిచూస్తే మగవాని వ్రాతలా లేదే అని రిమార్కు చేసింది!...అవునన్నాను... ఆఖర్ని చారుణి అన్న సంతకం చూసింది. "ఏలూరునుంచి చారుణి అనే వ్యక్తి నీకెందుకు వ్రాసిందీ ఉత్తరము?" అందినవ్వుతూ!

"స్నేహితురాల్ని కాబట్టి..." అన్నాను తప్పించుకుంటున్నానని తెలియనివ్వకుండా!

"అయితే నీకు ఆడపిల్లలతో స్నేహం యింకా..." అని అనబోయింది.

"ఆ ఈ ఉత్తరం ఆడది వ్రాసిందనే యెందుకనుకొన్నావు?..." అని వెంటనే ఎదురు ప్రశ్న వేశాను.

"కాక మగవాడే వ్రాశాడని అనుకో మంటావా?..." అంది!

"ఆ!..." అన్నాను.

"మగవాడైతే పదో తారీఖుదాక ఫాండర్ అంటారు. ఈ ఉత్తరం వ్రాయద్దు అని ఎందుకు వ్రాస్తాడు?...ఈ ఉత్తరం వ్రాసేటూడా ధైర్యం లని కోడుకు అంటారా?......" నిక్కగా నిలబెట్టి అడిగింది ఆమె! ఆమెకేం తక్కువ తిన్నదా మరి!....

తప్పనిసరయి ఒప్పుకున్నాను.

"నా స్నేహితురాలు వ్రాసింది..." అన్నాను.

"అయితే కార్డుమీద వ్రాసిందేం?... ఆడపిల్లలు కవర్లే కాని కార్డులు వ్రాయరుగా!..." అంది అర్థోక్తిగా.

"అవును!...అది లోకానికి తెలిపి రహస్యాలమనుని విషయాల్ని మరుగుపర్చేవారు చేసేపని!...మా కేలాటి రహస్యాలు లేవు... అలాంటప్పుడు ఎలా వ్రాస్తేనేం? ..సంగతులు తెలిసికోవటమేగా?..." అన్నాను. ఆలోచించి.

"అయితే మరి పదో తారీఖుదాక ఎందుకు వ్రాయద్దని వ్రాసింది? తండ్రికి తెలియకూడదా యీ ఉత్తరాల సంగతి?" అంది.

## శాంతిశ్రీ

"అవును! అదే ఉద్దేశం!...తండ్రికి యిలాటివి నచ్చవు!...ఆమె తండ్రికే కాదు...లోకంలో ఏతండ్రికీ తన కూతురు యింకొకరికి...అందులోనూ పురుషమిత్రునికి ఈ ఉత్తరం వ్రాయటం నచ్చదు." అని అందరి తండ్రులమీద ఓ రిమార్కు విసిరాను.

క్షణంసేపు మౌనంగా గడిచింది. కార్డు తీసికొన్నాను. మడిచి నవ్వుకుంటూ జేబులో పెట్టుకున్నాను. ఈసారి లాగు జేబులో పెట్టుకున్నాను.

"అయితే ఆ అమ్మాయికి పెళ్ళియిందా?".. అని మళ్ళీ అడిగింది.

"ఏం? అలా అడిగావు?" అన్నాను.

"అహా! ఏం లేదు... తెలుసుకుందామని!... అంతే!..." అంది!

"లేదు." అన్నాను ముక్తసరిగ.

ఈ సమాధానానికి ఆమె ఆశ్చర్యపడుతుం దేమోననుకున్నాను. కాని ఆమె ఏమాత్రము చలించలేదు. బహుశా ఊహించిన సమాధానంకూడ యిదే నేమో!...

"అయితే వాళ్ళెవరు?..." అంది మళ్ళీ.

"అంటే?—" అన్నాను.

"వాళ్ళెవరని?...మనవాళ్ళేనా?..." అంది మళ్ళీ.

"ఆ!...మానవులే!" అన్నాను గొప్పగా అర్థం తీస్తూ!

"అది కాదురా!...మనకులమేనా!..." అంది.

"ఆ!...చాలా!...యింకా కావాలా వివరాలు?" అన్నాను.

"అలా కోప్పడకోయ్ మిస్టర్" అంది.

"అబ్బే! నాకోపం దేనికి పిన్నీ?.." అన్నాను పైకి...లోపల బాధగా ఉన్నా!

"ఎన్నేళ్ళుంటాయి?" అంది మళ్ళీ.

"ఇరవై..." అన్నాను.

ఆమె ఎందుకిలా నిలదీసి ప్రశ్నిస్తోందో అర్థంకాకపోలేదు. ఆమెకూ స్వాతంత్ర్యం ఉంది నాకో చనువూ ఉంది. అందుకే ఆమె అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాను. నేనేదో ప్రణయకలాపంలో పడ్డానని ఆమె భ్రమించింది.

"అయితే ఆమెన్ప్రేమిస్తున్నావా?..." అంది తీవ్రంగా.

"ఆ!..." అన్నాను ధైర్యంగా.

"ఏమన్నావ్?...ఒక్కసారి ఉలిక్కి పడుతూ.

"ఏం ఉలిక్కిపడ్డావేం?......ప్రేమించడం తప్పా?..." ఎదురుప్రశ్న వేశాను.

"అయితే ఆమెను పెళ్ళి చేసి కొంటావా?..." అని అడిగింది.

బహుశా యిది ఆఖరి ప్రశ్న కావచ్చు! ఈ ప్రశ్నకోసమే యింతవరకూ గ్రంథం నడిపిందనుకున్నాను.

"మాట్లాడవేం?...ఆమెను పెళ్ళిచేసి కొంటావా?" అని మళ్ళీ ప్రశ్నించింది.

"అయితే పిన్నీ! ప్రేమించడం పెళ్ళి చేసికోవడంకోసమేనా?" అన్నాను.

"మరి యింతవరకు పెళ్ళి చేసికోక పోవటానిక్కారణం?" అంది.

"ఎవరూ? ఆమెయా?... నేనా?..." అన్నాను.

"ఇద్దరూను..." అంది తానేదో రహస్యం కనిపెట్టినట్టుగా.

"చాల పెద్ద ప్రశ్న!. అది వ్యక్తిగత విషయాలకు సంబంధించినది. నేను పెళ్ళి చెసుకోక పోవటానికి కారణం నీతో చాలాసార్లు చెప్పాను. ఇక పోతే ఆమె విషయం... నాకు తెలియదు..." అన్నాను.

"అయితే యెప్పుడూ తెలిసికోలేదా?..."

"తెలిసికోవాల్సిన అవసరం కనపడలేదు..." అన్నాను.

"అయినా ఆమెను ప్రేమిస్తున్నావు... అవునా!..." అంది మళ్ళీ ఆఖరిసారిగా.

"ఆ!...యింకా గట్టిగా చెప్పనా?..." అన్నాను.

"మరయితే ఆమెను పెళ్ళిచేసికోవడం నీ కిష్టమేనా?..." అని ప్రశ్నించింది.

"ఆలోచించాలి!..." అన్నాను.
"ఎవరితో?...ఆమెతో నా?..." అంది!
చక్కటిప్రశ్న!...ఎంతో చాకచక్యంగా ప్రశ్నించింది.
"అవును...ముందు నా అంగటనే నాలో చించుకుని ఆ తర్వాత ఆమెతో ఆలోచించాలి..." అన్నాను.
"ముందు నువ్వాలోచించుకున్నావా?..." అంది.
"ఇంతవరకూ నాకా ఆలోచన కలగలేదు..." అన్నాను.
"పోనీ యిప్పుడడుగుతున్నాను నేను. ఆలోచించి చెప్పగలవా?..." అంది.
"అంత తొందరపడి ఏ నిర్ణయానికి రాలేను..." అన్నాను.
"ఈ విషయాన్ని మీ ఉత్తరాల్లో ఎప్పుడూ వ్రాసుకోలేదా?..." అంది.
"మాకీ ప్రసక్తి యింతవరకు రాలేదు. అయినా ఆమెకలాంటి ఉద్దేశం ఉందో లేదో..." అన్నాను...
"ఆమెను ఒప్పించే భారం నాది... నీకంగీకారమేనా?..." అంది.
పాపం!...నన్ను ఒక యింటివాణ్ణి చేయాలని ఎంతగానో తాపత్రయపడుతున్న ఎంతో మంది శ్రేయోభిలాషుల్లో ఈమె ఒకరు. అందుకనే ఆమెను వారించలేక పోయాను. కాని నేను యెందుకు పెళ్లి చేసికోనంటున్నానో నా ఆశయమేమిటో ఏ ఒక్కరికీ సరిగా అర్థం కావటం లేదు.
"అయినా ఆమెది మనశాఖ కాదుగా!.." అన్నాను
"నీకసలు జాతిమత భేదాలేలేవుగా!..." దెప్పిపొడిచింది!.
"అయినా మన పెద్దలకుంటాయిగా." తప్పించుకున్నాను.
"ఆ సంగతి నేను చూస్తాను..." హామీ యిచ్చింది.
"ఒకవేళ ఆమె అంగీకరించక పోతే?" అనుమానంగా అన్నాను.
"నీ కోరికగా తెలియపర్చు..." అంది.
"నిరాకరిస్తే—" అన్నాను.
ఆమెకేం అర్థం కాలేదు...ఏం మాట్లాడాలో తోచలేదు.
"అలా నిరాకరించేదాన్ని ప్రేమించడ మెందుకు?..." కొంచెం చిరుకోపంగ అంది.
"మన కోరికలను తీర్చేందుకా స్త్రీలను కాని, పురుషుల్ని కాని ప్రేమించడం!" అన్నాను.
"మరయితే యెందుకంటావ్?" అంది!
"పొరపడుతున్నావు పిన్నీ! ... నేనామెను స్నేహితురాలిగా గౌరవిస్తున్నాను."
"నీ విచ్చే గౌరవాన్ని తిరస్కరించి నిన్ను నిరాకరించినా ఆమెను గౌరవిస్తావా?" తీవ్రంగా అడిగింది.
"ఆ!...నిన్ను గౌరవించినట్టుగానే!..." అన్నాను తడుముకోకుండా.
పిన్ని తెల్లబోయింది. నిర్ఘాంత పోయింది. ఏం మాట్లాడాలో తెలియక తబ్బిబ్బైంది.
"నన్ను అపార్థం చేసికొన్నానురా?..." అంది జాలిగా.
"అది మానవ సహజం...యింకా చెపితే మానినీ సహజం...మరేం పర్వాలేదులే... అయినా యీ రోజు నీమాలాన్నీ నేనొక విషయాన్ని గురించి ఆలోచించాల్సి ఉందని నిశ్చయించుకున్నాను..." అన్నాను.
"నీది మా నిగ్రహమైన బుద్ధిరా!..." అంటూ కాఫీ అందిచ్చింది!
కాఫీ త్రాగి అక్కడినుంచి వచ్చేశాను.
—ఇదీ జరిగిన విషయం!...చారుణీ!... ఇప్పుడు నీకు వ్రాస్తున్నాను. జరిగిన విషయాన్ని విశదంగా...శ్రద్ధగ చదువుకొని నీ అభిప్రాయాన్ని, ఉద్దేశ్యాన్ని తప్పకుండా వ్రాస్తావని ఆశిస్తున్నాను.
వచ్చేవారం నీ సమాధానం కోసం యెగురు చూడనా?" ★


# దేహకాంతిని రక్షించే సబ్బు

## విశేషగుణముగల నురుగుతో కూడిన తాతావారి యు-డి-కోలోన్ సబ్బు

ఈ సబ్బు యిచ్చే విశేషగుణముగల మృదువైన నురుగు మీ చర్మమును ఎంతో బాగా శుభ్రము చేస్తుంది మరియు మీ దేహకాంతికి రక్షణనిస్తుంది దాని సున్నితమైన సువాసన మీ మనస్సుకు ఉల్లాసము కలిగిస్తుంది అది తాజాగా ఉండుటకు అల్యూమినపు కాగితములో ప్యాకు చేయబడి అమ్మబడుతోంది.
తాతావారి యు-డి-కోలోన్ సబ్బును వాడుట నేడే ప్రారంభించండి!

తాతా ఆయిల్ మిల్స్
కంపెనీ లిమిటెడ్

